క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

మోతె: పోలీసులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తేనే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం ఆయన మోతె పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, పలు విభాగాలను పరిశీలించారు. పలు విషయాలను ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి ముందుగా కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, సిబ్బంది ఉన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం



బహుమతులు అందజేస్తున్న సీఐ రాము

కోదాడరూరల్ : పోలీసు అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కోదాడ సీఐ రాము అన్నారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మహేంద్రయూత్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సీఐ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు లాజర్ ఉన్నారు.

సిమెంటు బెంచీల ఏర్పాటు



ఏర్పాటు చేసిన బెంచీతో దాత రవి తదితరులు

మునగాల: మండలంలోని బరాఖత్‌గూడేనికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి రవి తన తల్లిదండ్రులు ఓరుగంటి రంగయ్య-అనసూయమ్మల జ్ఞాపకార్థం ఓరుగంటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునగాల, బరాఖత్‌గూడెం గ్రామాల్లో సిమెంట్ బెంచీ లను ఏర్పాటు చేయించారు. రవి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఓరుగంటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రూ.లక్ష వెచ్చించి 25సిమెంటు బెంచీలను తయారు చేయించి మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, వివిధ కూడళ్లలో ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.

క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

గరిడేపల్లి: రాష్ట్రంలో కబడ్డీ క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ ఉపాధ్యక్షుడు రామినేని భూలోకరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ బాచుపల్లి కాసాని జ్ఞానేశ్వర్ కబడ్డీ అకాడమీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర కబడ్డీ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. భూలోకరావు ఎన్నిక పట్ల మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రామినేని కృష్ణయ్య, మాజీ సర్పంచ్ అశోక్, వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు టి.రవీందర్‌రెడ్డి కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో టీపీయూఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ స్రవంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాయిలు, సత్యనారాయణ, ఖాజా, నాగేందర్ పాల్గొన్నారు.

బాలునాయక్‌కు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

మఠంపల్లి: మండలంలోని భీల్యానాయక్‌తండాలో అనారోగ్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ తండ్రిని సోమవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యామంజీనాయక్ ఆధ్వర్యంలో పలువురు పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, నాయకులు నవీన్‌నాయక్, భాస్కర్ నాయక్, భీముడునాయక్, మోతీలాల్‌నాయక్, లోకనాథం, తులసీరామ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆలయ ధర్మకర్త మృతి

నేరేడుచర్ల: నేరేడుచర్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాల్వాయి రమేష్ సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. నేరేడుచర్లలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా ఉన్న ఆయన సోమవారం స్వామివారి కల్యాణం పూర్తయిన కొద్దిసేపటికే ఆలయంలో కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న భక్తులు, మిత్రులు ఆయనను మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రమేష్ భౌతికకాయానికి పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు.

సంతలో దళారుల దందా!

- కోదాడ నుంచి యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా
- దళారులకు భయపడి పశువుల క్రయవిక్రయాలకు సంతకు రాని రైతులు
- పోలీసులు దళారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు
- అధికారులు విచారణ జరపాలంటున్న రైతు సంఘాల ప్రతినిధులు



మునగాల పోలీసులు పట్టుకున్న పశువులు (ఫైల్)

కోదాడ: కోదాడ పశువుల సంతలో దళారుల దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అరికట్టాల్సిన వారే దళారులతో చేతులు కలిపి దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దళారుల దందాకు భయపడి వ్యవసాయ, పాడి పశువుల అమ్మక కొనుగోళ్ల కోసం రైతులు సంతకు రావడానికే భయపడిపోతున్నారు. సంతలో రెండు గ్రూప్‌లుగా విడిపోయిన దళారులు వారికి కాకుంటే మాకు మాత్రమే అమ్మాలి అంటూ వ్యాపారులను బెదిరించడం, వినకపోతే దాడులు చేయడానికి కూడా తెగబడుతుండడంతో సంతకు రావడానికే హడలిపోతున్నారు. గతంలో వేల సంఖ్యలో క్రయవిక్రయాలు జరిగే సంతలో ఈ దళారుల బెడదతో క్రయవిక్రయాలు వందల్లోకి పడిపోయాయి.

సంత షెడ్లలో శాశ్వతంగా తిష్ట

కోదాడ వ్యవసాయమార్కెట్ ఆవరణలో ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తుంటారు. ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కోసం షెడ్లను నిర్మించారు. కానీ కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అధికారుల, పాలకవర్గాల నిర్లక్ష్యంతో గింజ ధాన్యం కొనే దాఖలాలు లేవు. కనీసం ధాన్యం కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేసినవారు లేక రేకుల షెడ్లు ఖాళీగా ఉంటాయి. దీంతో పశువుల దందా చేసే వారు ఈషెడ్లను శాశ్వతంగా ఆక్రమించారు. తాము కొనుగోలు చేసే పశువులను ఈ షెడ్లలోనే నెలల తరబడి ఉంచుతున్నారు. ఇటీవల మార్కెట్ అధికారులు ఈ షెడ్లకు విద్యుత్, నీటి సరఫరాను కట్ చేయడంతో ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తెచ్చి వెంటనే పునరుద్ధరించుకున్నట్లు సమాచారం.మార్కెట్ అధికారులు కూడా ఏమి చేయలేక చేతులెత్తేస్తున్నారు.

కోదాడ సంత నుంచే రవాణా

వట్టిపోయిన పశువులను అమ్మడానికి నిలయంగా మారిపోయింది కోదాడ పశువుల సంత. ఇక్కడకు వచ్చే లేగ దూడలను, ఆరోగ్యంగ ఉండే దున్నలు, గేదెలను కూడా వట్టిపోయినవిగా చూపి లారీల్లో అక్రమంగా కబేళాకు తరలిస్తున్నా పట్టించుకునేవారు లేరు. శనివారం కోదాడ సంత నుంచే అక్రమంగా పశువులను తరలిస్తుంటే మునగాల పోలీసులు పట్టుకున్నారు. కానీ కోదాడ పోలీసులు మాత్రం ఈ సంతపై కనీస దృష్టి సారించడం లేదు. వారం రోజుల క్రింత కోదాడ నుంచి కోల్‌కతాకు పశువులను రవాణా చేస్తుండగా కొందరు పోలీసులు ఆపి సదరు వ్యాపారి నుంచి భారీ మొత్తంలో వసూలా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులకు, వ్యాపారులకు మధ్య కొందరు దళారులుగా వ్యవహరిస్తూ రాత్రి సమయాల్లో గస్తీ తిరుగుతూ సెటిల్‌మెంట్లు చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారనే విమర్శలు ఉన్నాయి. సంతలో జరుగుతున్న దందాలపై పోలీసులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని, రైతులు మార్కెట్‌కు స్వేచ్ఛగా వచ్చే అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

> **సంత అక్రమాలపై విచారణ జరపాలి**
>
> కోదాడ పశువుల సంతలో లేగదూడలు, పాడి పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కాళ్లు విరిచి దయనీయంగా రవాణా చేస్తున్నా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవపోవడం దారుణం. పట్టపగలు సంతలోనే పశువులను అమానుషంగా లారీల్లో కుక్కి రవాణా చేస్తున్నా పట్టించుకోకపోవడం వెనుక ఉన్న కారణాలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలి. పశుసంపదను కాపాడాలి.
>
> – తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

వేధింపుల నివారణ చట్టంపై అవగాహన



జీవీ మాల్ వద్ద అవగాహన కలిగిస్తున్న చైతన్య

కోదాడరూరల్ : పనిచేసే ప్రదేశంలో ఎవరైన లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని మహిళా సాధికారిత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. సోమవారం పట్టణంలోని జీవీ మాల్‌లో పనిచేసే ప్రదేశంలో వేధింపుల నివారణ చట్టంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. పనిచేసే ప్రదేశంలో మహిళలు ఇబ్బందులు పడకుండా స్వేచ్ఛగా పనిచేసుకోవాలని అప్పుడే మహిళా సాధికారిత సాధించినట్టని తెలిపారు. ఎక్కడైనా పదిమంది కంటే ఎక్కువమంది మహిళలు పని చేస్తారో అక్కడ ఇంటర్నల్ కంప్లెయిట్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. వేధింపులకు గురైనప్పుడు సఖి టోల్ ఫ్రీ నంబర్ 181కి ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని సూచించారు. మహిళల కోసం సఖి సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సాధికారిత కేంద్ర జెండర్ స్పెషలిస్ట్ రేవతి, వినోద్, మాల్‌సిబ్బంది ఉన్నారు.

కనుల పండువగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పుష్పార్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శ్రీనివాసాశాస్త్రి, వేద పండితులు ఇరువంటి శ్రీపాద శర్మ, సంతోష్‌ల ఆధ్వర్యంలో వేద మంత్రోత్సవాలతో సంప్రదాయ బద్ధంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. సాయంత్రం భక్తిపాటతో పవళింపు సేవ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ధర్మకర్తలు పాల్వాయి శ్రీనివాస్, పాల్వాయి రమేష్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొనతం చిన వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు రాచకొండ రాంమోహన్‌రావు, సోమప్ప దేవాలయం కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ, కట్ట గణేష్‌రెడ్డి, బెల్లంకొండ నర్సింహారావు, పానుగోడు జంగారావు, మారు శ్రీనివాస్‌రావు, యడవల్లి వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా బహుళ ఏకాదశి పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం బహుళ ఏకాదశి పూజా కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సహస్రనామ ఫల పుష్పార్చన, మంగళాశాసనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, ఆలంకరణ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం దాత తంగేళ్ల మంగయ్య-వరలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ధర్మకర్తలు తిపిరిశెట్టి హరీష్, ప్రసాద్, అంజయ్య, నర్సింహారావు, హనుమంతు, కవిత, ఈఓ ఎంసీ, లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

'రాజకీయంగా ఎదుర్కోలేక అసత్య ఆరోపణలు'

హుజూర్‌నగర్‌రూరల్ : మాజీ మంత్రి కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక సీఎం రేవంత్‌రెడ్డి అసత్య ఆరోపణలకు తెర తీశారని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమరవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ బావమరిది రాజేంద్రప్రసాద్ నూతన గృహప్రవేశం సందర్భంగా ఏర్పాటు చేసిన కుటుంబ సభ్యుల విందును డ్రగ్స్, రేవ్ పార్టీ అంటూ చిత్రీకరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేటీఆర్ కుటుంబ సభ్యులు ఎవరు హాజరు కానప్పటికీ వెళ్లినట్టు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం : సీఐ

పాలకవీడు: మండల పరిధిలోని జాన్‌పహాడ్‌దర్గా వద్ద బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు వెచ్చా సందీప్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికులను విచారించారు. ప్రస్తుతం సందీప్ ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. మెడ, ఛాతీ, గడ్డం, చేతిపై బలమైన గాయాలయ్యాయని తెలిపారు. హత్యాయత్నానికి పాల్పడిన నిందితులు పరారీలో ఉన్నారని సీఐ పేర్కొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ పరామర్శ

హుజూర్‌నగర్ : పాలకీడు మండలం జాన్‌పహాడ్ దర్గా వద్ద జరిగిన దాడిలో గాయపడిన వెచ్చ సందీప్ కుమార్‌ను సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



రైతులకు కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్త సుగంధి

గరిడేపల్లి : షెడ్యూల్డ్ కులాల రైతులు పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్ సుగంధి సూచించారు. మండల పరిధిలోని గడ్డిపల్లి కేవీకే ఐసీఏఆర్ అటారీ ఆర్థిక సహకారంతో షెడ్యూల్డ్ కులాల రైతులకు పెరటి కోళ్లను సోమవారం ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమిలేని రైతులు పెరటి కోళ్లను పెంచుకోవడం ద్వారా మంచి పోషకాహారం లభించడమే గాక గుడ్లు, మాంసపు ఉత్పత్తితో ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త సీహెచ్ నరేష్, సెరికల్చర్ టి. మాధురి, సూపరింటెంట్ ఉపేందర్, కట్టెల శ్రీను, 25మంది మహిళలు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, మంగాచార్యులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం అమలు చేయాలని వినతి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేదాలని కాంగ్రెస్ నాయకులు మన్సూర్‌అలీ కోరారు. సోమవారం హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీతమ్మ, కొండలు, లక్ష్మీ, రాములమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

మునగాల: ఉపాధ్యాయులు విధిగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. సోమవారం తహల్దార్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, ఎంఆర్‌ఐ ఎస్.రామారావు పాల్గొన్నారు..

రాష్ట్ర కార్యదర్శిగా ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నేరేడుచర్ల మండల కేంద్రానికి చెందిన దూళిపాల ధనుంజయనాయుడిని సూర్యాపేటలో జరిగిన రాష్ట్ర మహాసభలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియమానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళకు రక్తదానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు బి పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో సోమవారం డీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యుడు పత్తిపాటి రవితేజ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

క్రిబ్‌కో ఆర్‌జీబీ మెంబర్‌గా నరేందర్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్ క్రిబ్‌కో కంపెనీ రీజినల్ జనరల్ బాడీ (ఆర్‌జీబీ)మెంబర్‌గా ఎన్నికయ్యారు. సోమవారం ఆయనను పాలకవర్గ సభ్యులు, రైతులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

తల్లీకుమార్తె అదృశ్యం

హుజూర్‌నగర్: పట్టణానికి చెందిన తల్లీకుమార్తె అదృశ్యమయ్యారు. హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ షబీనా తన 9 ఏళ్ల కుమార్తె ఇషాతో కలిసి ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సబీనా తండ్రి షేక్ గన్ సైదా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల: రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నేరేడుచర్లలోని రామాపురం రోడ్డులో సోమవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా.. శివాజీనగర్‌కు చెందిన ఇంజమూరి సురేష్ రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి కోళ్లఫారాలకు అమ్మేందుకు ఆటోలో తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. 8క్వింటాళ్ల బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని, సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఐదు డీఏలు ఇస్తామని ఒక డీఏ ఇవ్వడమేంటి?

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



హుజూర్‌నగర్: ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు ఇస్తామని చెప్పి ఒక డీఏ ఇవ్వడం ఏంటని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని పలు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఒక డీఏ ఇవ్వడంతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాడే వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు అనిల్ కుమార్, బీరెల్లి శ్రీనివాసరెడ్డి, దామోదర్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంత్, ప్రభాకర్ రెడ్డి, చిక్కుళ్ళ గోవింద్, శ్రీనివాస్ రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌తోనే సమస్యలు పరిష్కారం

గరిడేపల్లి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం టీఎస్ యూటీఎఫ్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో ఓటరు నమోదు అవగాహన కల్పించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సంఘం జిల్లా కార్యదర్శి బాలసైదిరెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, మండల విద్యాధికారి చత్రునాయక్, నాగమణి, ఖాజా, అర్జున్, విజయలక్ష్మి, శైలజ, సుహాసిని, సైదమ్మ, రాంబాబు, రవీందర్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్షణ కరువు

- ఇటీవల వర్షాలకు కూలిన ప్రహరీ
- రాత్రి వేళల్లో పీహెచ్‌సీలోని మొక్కలను ధ్వంసం చేస్తున్న మూగజీవాలు
- నూతన ప్రహరీ నిర్మించాలని విజ్ఞప్తి



కూలిన చిలుకూరు పీహెచ్‌సీ ప్రహరీ

చిలుకూరు: మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్షణ కరువైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంతర గంగ వాగులోకి భారీగా వరద నీరు చేరి ఉధృతంతగా ప్రవహించడంతో పీహెచ్‌సీ ప్రహరీ కూలిపోయింది. పీహెచ్‌సీలోకి భారీగా వరద రావడంతో ఫైళ్లు తడిసిపోయాయి. జిల్లా వైద్యాధికారి కోటాచలం పీహెచ్‌సీని పరిశీలించి త్వరలో ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు. పంచాయతీ అధికారులు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా రూ.15లక్షలు మంజూరయ్యాయి.

మొక్కలు ధ్వంసం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీకి నిధులు మంజూరైనా నేటి వరకు పనులు ప్రారంభించడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో మూగజీవాలు పీహెచ్‌సీ ఆవరణలోనే తిష్టవేస్తున్నాయి. అక్కడ ఉన్న మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. దీనికి తోడు ప్రహరీ కూలి పక్కనే ఉన్న డ్రెయినేజీలో పడడంతో మురుగు నీరు ప్రవహించక, నీళ్లు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోడ నిర్మాణం చేపట్టి, డ్రెయినేజీని శుభ్రం చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో 1981–84 బీకాం బ్యాచ్ విద్యార్థులు సోమవారం హైదరాబాద్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్న నాటి స్నేహితులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువును పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, బీఎస్‌ఆర్ వేణుగోపాల్ శర్మ, సైదిరెడ్డి, రాజేంద్రప్రసాద్, పద్మ, జయశ్రీ, అశోక్, మధు, రమేష్, పరాంకుశం, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని యాదవ్ బజారుకు చెందిన నికితకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు అందజేశారు. కార్యక్రమంలో జక్కుల మల్లయ్య, కోడి ఉపేందర్, అజీజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హుజూర్‌నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంప్ హైస్కూల్‌లో అండర్-14, 17 బాలబాలికలకు జిల్లాస్థాయి కబడ్డీ క్రీడలు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ ఆజంబాబా సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమతమ భోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డి.రవి పీడీకి క్యాంప్ హైస్కూల్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ 984859625 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

కోదాడరూరల్ : ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో రాణించి కుల అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘ రాష్ట్ర నాయకులు భాషబోయిన భాస్కర్‌రావు అన్నారు. సోమవారం ముదిరాజ్‌సంఘభవనంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ముదిరాజ్ యువతను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నియోజకవర్గ కన్వీనర్ ముసి శ్రీనివాసరావు, సారగండ్ల సత్తయ్య, మట్టయ్య, వీరబాబు, రమేష్, సింగరయ్య, వెంకన్న ఉన్నారు.



సన్మానిస్తున్న ముదిరాజ్ కుల సంఘం నాయకులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందంజ



సభ్యత్వ నమోదు పత్రాలతో పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందంజలో ఉంటుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు యడవల్లి సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మాజీ మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాతంగి సైదులు, పాఠశాల ఉపాధ్యాయులు ఎల్ గోపయ్య, కందిమళ్ల సైదులు, వెంకటేశ్వర్లు, లింగయ్య, రాఘవారెడ్డి, శ్యాంబాబు, యాదయ్య తదితరులున్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

మునగాల: మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో ఉన్న అన్నప్రసాద వితరణలో సోమవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 200మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. కార్యక్రమానికి గ్రామానికి చెందిన బోనాల వెంకటప్పయ్య -జయమ్మ, తోట రామకృష్ణ -రజిత దంపతులు సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్టు గురుస్వామి, కొమ్ము ఈదారావుతో పాటు పలువురు అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

భద్రాచలంలో కొండాయిగూడెం భక్త బృందం



భద్రాచలంలో సేవలందిస్తున్న భక్త బృందం

గరిడేపల్లి: మండల పరిధిలోని కొండాయిగూడెంలో శ్రీ కోదండ రామస్వామి భక్త భజన మండలి సభ్యులు భద్రాచలంలోని కోదండ రామస్వామి దేవాలయంలో సేవలందిస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు, యువకులు భద్రాచలంలో సేవలందించేందుకు ఇటీవల అక్కడికి తరలివెళ్లారు. దేవాలయ సేవల్లో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్వహణలో తాము భాగస్వాములు కావటం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంటున్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.